రంజాన్ వేళలు
ఇఫ్తార్ : శనివారం సా : 6.34 గం.
సహర్ : ఆదివారం ఉ: 4:55 గం.





వెంకట్రామారెడ్డికే టికెట్

మెదక్ లోక్‌సభ బరిలో మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ

- ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- అధికారిగా ఉమ్మడి జిల్లాతో అనుబంధం
- సిద్దిపేట కలెక్టర్‌గానూ ఐదేళ్లపాటు విధులు
- అనూహ్యంగా అభ్యర్థిత్వం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట మార్చి 22: మెదక్ లోక్‌సభ బీఆర్ఎస్ టికెట్‌ను ఎవరి కేటాయిస్తారన్న సస్పెన్స్‌కు తెరపడింది. ఆ పార్టీ ఎమ్మెల్సీ, వీఆర్ఎస్ తీసుకున్న కలెక్టర్ పి.వెంకట్రామారెడ్డికి ఎంపీ టికెట్‌ను ఖరారు చేస్తూ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రకటించారు. అయితే, నెల క్రితమే వెంకట్రామారెడ్డి పేరు తెరపైకి వచ్చినప్పటికీ ఆ తర్వాత గజ్వేల్ నేత వంటేరు ప్రతాపరెడ్డినే ఖరారు చేసే అవకాశం ఉందనే ప్రచారం జరిగింది. తాజాగా కేసీఆర్ సైతం పోటీకి దిగే అవకాశాలున్నాయనే చర్చ కొనసాగింది. కానీ, వీటన్నింటికి ఫుల్‌స్టాప్ పెడుతూ అనూహ్యంగా మళ్లీ వెంకట్రామారెడ్డి వైపే మొగ్గు చూపించారు. శుక్రవారం ఎర్రవల్లిలోని వ్యవసాయక్షేత్రంలో మెదక్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలతో కేసీఆర్ సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు.

జేసీగా, కలెక్టర్‌గా గుర్తింపు

గ్రూప్-1 అధికారిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన వెంకట్రామారెడ్డి ఆరేళ్ల పాటు ఆర్డీవోగా, ఆ తర్వాత డ్వామా పీడీగా బాధ్యతలు నిర్వర్తించారు. 2009లో ఉమ్మడి మెదక్ జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా, 2014లో జాయింట్ కలెక్టర్‌గా కొనసాగారు. కొత్త జిల్లాల ఆవిర్భావంతో 2016 నుంచి 2021 వరకు సిద్దిపేట తొలి కలెక్టర్‌గా సుదీర్ఘకాలం పనిచేశారు. ఎన్నికల నేపథ్యంలో కొద్దిరోజులు మెదక్, సంగారెడ్డి జిల్లాలకు ఇన్‌చార్జి కలెక్టర్‌గానూ విధులను నిర్వహించారు. సిరిసిల్ల కలెక్టర్‌గా 8 నెలలు ఉన్నారు. దాదాపు పదేళ్లపాటు ఉమ్మడి మెదక్ జిల్లాతో సంబంధం ఉంది.

రాజీనామా చేసి రాజకీయాల్లోకి..

సిద్దిపేట కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న క్రమంలోనే 2021లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. వెంటనే ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే మెదక్ పార్లమెంట్ పరిధిలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి టికెట్ ఆశించారు. కానీ అప్పటి పరిణామాల దృష్ట్యా టికెట్ దక్కలేదు. ప్రస్తుతం మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిత్వం దక్కడం గమనార్హం.

ఆచితూచి అభ్యర్థిత్వం

బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటగా ఉన్న మెదక్ పార్లమెంటుకు సంబంధించి బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపిక విషయంలో మల్లగుల్లాలు పడ్డారు. ఈ పార్లమెంటు పరిధిలోని ఏడు స్థానాల్లో ఆరింటిలోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే గెలిచారు. 2004 నుంచి మెదక్ లోకసభ స్థానం బీఆర్ఎస్ ఖాతాలోనే చేరుతుంది. ఇదే పార్లమెంటు పరిధిలో మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్, మాజీ మంత్రి హరీశ్‌రావు నియోజకవర్గం సిద్దిపేట ఉన్నాయి. దీంతో ఎలాగైనా ఈ స్థానాన్ని నిలబెట్టుకోవాలనే ఆలోచనతో అభ్యర్థిని ఆచితూచి ఎంపిక చేసినట్లుగా తెలుస్తున్నది. వెంకట్రామారెడ్డి పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాలతో సంబంధాలు కలిగి ఉండడం కూడా పార్టీ అధిష్ఠానం పరిగణనలోకి తీసుకున్నది.

పెండింగ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి

మెదక్ పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి ఇప్పటికే బీజేపీ తమ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావును ప్రకటించింది. రఘునందన్ ఇప్పటికే క్షేత్రస్థాయిలో ప్రచారం కూడా చేస్తున్నారు. తాజాగా బీఆర్ఎస్ సైతం తమ అభ్యర్థిగా వెంకట్రామారెడ్డిని బరిలోకి దింపింది. వీరిద్దరు కూడా ఉమ్మడి జిల్లాలో గుర్తింపు పొందిన వ్యక్తులే. ఇద్దరి పోటీ రసవత్తరంగా ఉండబోతుందనేది నిస్సందేహమే. ఇక కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థిని ప్రకటించడంలో జాప్యం చేస్తున్నది. ఇటు బీజేపీ, అటు బీఆర్ఎస్ ఆచితూచి అభ్యర్థులను ఎంపిక చేయడంతో కాంగ్రెస్ కూడా ఆ దిశగా యోచించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. అయితే నీలం మధు పేరును దాదాపు ఖరారు చేశారని అంటున్నప్పటికీ అధికారికంగా ప్రకటించకపోవడం సందేహాలకు తావిస్తున్నది. బీఆర్ఎస్ అభ్యర్థిగా వెంకట్రామారెడ్డిని అనూహ్యంగా తెరమీదకు తెచ్చినట్లుగానే కాంగ్రెస్ నిర్ణయం కూడా ఉండబోతుందా.. అనే ఊహాగానాలు సైతం లేకపోలేదు.



కేసీఆర్‌తో మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి

ప్రొఫైల్

పేరు: పరిపాటి వెంకట్రామారెడ్డి
భార్య: ప్రణీత
కుమారుడు, కూతురు: భరద్వాజ్‌రెడ్డి, రుత్విక
తల్లిదండ్రులు: రాజిరెడ్డి, పుష్పలీల
నివాసం: తెల్లాపూర్, పటాన్‌చెరు నియోజకవర్గం, మెదక్ పార్లమెంటు పరిధి
అధికారిగా: 1996లో గ్రూప్-1 సర్వీసు ద్వారా ఆర్డీవో ఉద్యోగం

హోదాలు

- బందరు, చిత్తూరు, తిరుపతి డివిజన్లకు ఆర్డీవో
- 2002-2004లో ఉమ్మడి మెదక్ జిల్లా డ్వామా పీడీ
- 2009లో ఉమ్మడి మెదక్ జిల్లా అడిషనల్ కలెక్టర్
- 2014-2016 వరకు ఉమ్మడి మెదక్ జిల్లా జాయింట్ కలెక్టర్
- 2016 నుండి 2021 వరకు సిద్దిపేట జిల్లా కలెక్టర్ (ఎన్నికల బదిలీల్లో భాగంగా మెదక్, సిరిసిల్ల, సంగారెడ్డి కలెక్టర్‌గా విధులు)
- 2021 నవంబరు 15న ఉద్యోగవిరమణ రాజకీయ అరంగేట్రం
- 2021 నవంబరులో బీఆర్ఎస్‌లో చేరిక, ఆ వెంటనే ఎమ్మెల్సీగా ఎంపిక
- ప్రస్తుతం మెదక్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎంపిక

ఫార్మా ముసుగులో నిషేధిత డ్రగ్స్

- నాలుగేళ్లలో నాలుగుసార్లు డ్రగ్స్ తయారీ గుట్టురట్టు
- మూడు నెలల కిందట కొడకంచిలో.. తాజాగా బొల్లారంలో పట్టివేత

జిన్నారం, మార్చి 22: అక్రమార్జనే ధ్యేయంగా ఫార్మా తయారీ ముసుగులో కొందరు నిషేధిత డ్రగ్స్‌ను తయారు చేస్తున్నారు. ఈ మత్తుపదార్థాల తయారీకి నగర శివారైన సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం మండలంలోని పారిశ్రామిక వాడలు అడ్డాగా మార్చుకుంటున్నారు. నాలుగేళ్లలో మూడు పరిశ్రమల్లో అధికారులు దాడులు నిర్వహించగా నిషేధిత డ్రగ్స్ తయారీని గుర్తించారు. మూడు నెలల కిందట మండలంలోని కొడకంచి శివారులో ఓ డ్రగ్స్ తయారీ కేంద్రంపై దాడులు నిర్వహించి మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. తాజాగా బొల్లారంలో రూ.8.99 కోట్ల విలువైన 90.40 కేజీల మెటాఫిడ్రోన్‌ను స్వాధీనం చేసుకోవటంతో మరోమారు డ్రగ్స్ కలకలం రేపుతోంది.

మూతపడ్డ పరిశ్రమల్లో

నగర శివారు ప్రాంతమైన పటాన్‌చెరు నియోజకవర్గం రాష్ట్రంలోనే ఫార్మా పరిశ్రమలకు కేంద్రంగా ఉన్నది. ఏటా దేశం నుంచి ఇతర దేశాలకు ఎగుమతి జరిగే ఫార్మా ఉత్పాదనలలో రాష్ట్రం వాటా సుమారు 35 శాతం కాగా ఎన్నో పేరెన్నిక గల పరిశ్రమలు ఇక్కడ ఉన్నాయి. ఇందులో భారీ పరిశ్రమలు 200 వరకు ఉండగా.. చిన్న, మధ్య తరహావి 600 వరకు ఉంటాయి. వాటిలో చాలా వరకు నిర్వహణ, వ్యాపార తదితర కారణాలతో మూతపడ్డాయి. కాగా కొన్ని చోట్ల ఖాయిలా పడ్డా చిన్న పరిశ్రమలను మత్తు పదార్థాల తయారీకి అడ్డాగా మారుస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పరిశ్రమ ప్రారంభానికి అనుమతులు ఇచ్చే పీసీబీ, పరిశ్రమల శాఖ, డ్రగ్ కంట్రోల్ విభాగాలకు ఏ పరిశ్రమలు మూతపడ్డాయో కచ్చితమైన సమాచారం ఉండడం లేదు.

లీజుకు తీసుకుని..

కొంత మంది అక్రమార్కులు మూతపడిన పరిశ్రమలను రహస్యంగా లీజు లేదా కొనుగోలు జరిపి నార్కోటిక్ నిషేధిత మార్ఫిన్, ఆఫెంటామైన్, ఎఫిడ్రిన్, అసిటోలోఫామ్ తదితర ఉత్ప్రేరకాలను తయారు చేస్తున్నారని ఆరోపణలున్నాయి. కొన్నిచోట్ల అనుమతి ఉన్న ఔషధ ఉత్పాదనలకు బదులు.. నిషేధిత డ్రగ్స్, వాటి ముడిసరుకులను తయారీ చేసే పరిశ్రమలున్నట్లుగా ప్రచారం ఉన్నది.

సిబ్బందికే అవగాహన కరువు

పారిశ్రామికవాడలలో ఓ పరిశ్రమలో జరిపే ఉత్పాదనపై మరో పరిశ్రమకుగానీ, అందులో పని చేసే సిబ్బందికి కూడా పూర్తి సమాచారం ఉండదు. ముఖ్యంగా రియాక్టర్ల వారీగా లీజు తీసుకోవటం, లేదా కొన్ని రోజుల పాటు ఉత్పాదనల కోసం ఒప్పందాలు జరిపి కేవలం రెండు మూడు నెలల వ్యవధిలోనే కోట్లాది రూపాయల విలువైన మత్తుపదార్థాలను ఉత్పత్తి చేస్తున్నారనే ప్రచారం ఉన్నది. గత నాలుగేళ్లలో బొల్లారం, కాజీపల్లి, గడ్డపోతారం, గండిగూడెం, కొడకంచి ప్రాంతాల పరిశ్రమలలో నార్కోటిక్, డ్రగ్ కంట్రోల్ విభాగాల ఆధ్వర్యంలో నాలుగుసార్లు దాడులు జరిపి వందల కోట్ల విలువైన డ్రగ్ స్వాధీనం చేసుకున్నారు. అయితే తరచుగా పరిశ్రమలపై డ్రగ్ కంట్రోల్ అధికారుల నిఘా కొరవడడంతోనే అక్రమార్కులు రెచ్చిపోతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పారిశ్రామికవాడలోని ఫార్మా కంపెనీలపై, వాటి ఉత్పత్తులపై క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుంటాం

- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి ప్రభాకర్

హుస్నాబాద్, మార్చి 22 : వడగళ్ల వర్షానికి నష్టపోయిన రైతాంగానికి పరిహారం అందించి ఆదుకుంటామని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ఆయన హుస్నాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో దాదాపు 2,800 ఎకరాల్లో నష్టం జరిగినట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించారని పేర్కొన్నారు. సిద్దిపేట, బెజ్జంకి వంటి ప్రాంతాల్లో వడగళ్లకు ఎక్కువ నష్టం వాటిల్లిందని వెల్లడించారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎక్కడా మంచినీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. తనకు వచ్చిన నిధులు మంచినీటి పనులకే వెచ్చిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. అవసరమైతే మంచినీటి సమస్య పరిష్కారానికి అదనంగా నిధులు తీసుకొస్తామని వివరించారు. సమావేశంలో టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, నాయకులు మంద ధర్మయ్య, బంక చందు, జంగపల్లి అయిలయ్య, అక్కు శ్రీనివాస్, వల్లపు రాజు, యాదవరెడ్డి తదితరులున్నారు.



హుస్నాబాద్ క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలి

- 'ఎంసీఎంసీ' సభ్యులకు కలెక్టర్ సూచన

సిద్దిపేటఅగ్రికల్చర్, మార్చి 22: లోక్‌సభ ఎన్నికల్లో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ (ఎంసీఎంసీ)కు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ మనుచౌదరి కమిటీ సభ్యులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎంసీఎంసీ కమిటీ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలోవ వచ్చే పెయిడ్ న్యూస్‌ల గుర్తింపు, పొలిటికల్ ప్రకటనలు, ప్రీ సర్టిఫికేషన్, మానిటరింగ్ ఇతర మీడియా సంబంధిత విధులను ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి నిర్వహించాలన్నారు. సమావేశంలో డీపీఆర్వో రవికుమార్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం పరిశీలన

లోక్‌సభ ఎన్నికల ప్రకియలో భాగంగా శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనుచౌదరి కలెక్టరేట్ పక్కన గల ఈవీఎం గోదాంను సందర్శించారు. ఈవీఎంల ర్యాండమైజేషన్, పంపిణీల సందర్భంగా టెంట్, టేబుల్స్, తాగునీటి వసతి, పార్టీ ప్రతినిధులు, అధికారులకు వేర్వేరుగా కుర్చీలు, ఇతరత్రా సౌకర్యాలు కల్పించాలని కలెక్టరేట్ ఏవో రెహమాన్‌ను ఆదేశించారు. చిన్నపొరపాటు కూడా జరగకూడదని ఆయన సూచించారు. గోదాం చుట్టూ 24/7 గట్టి బందోబస్తుతో విధులు నిర్వర్తించాలని పోలీసు అధికారులకు తెలిపారు.



ఎంసీఎంసీ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఖాజీపూర్‌లో ముదిరాజ్‌ల సాంఘిక బహిష్కరణ

- చేపలు పట్టుకునే విషయమై గ్రామస్థులకు, ముదిరాజ్‌లకు మధ్య వివాదం
- 25 ముదిరాజ్ కుటుంబాలను వెలేసిన గ్రామాభివృద్ధి కమిటీ
- నిత్యావసర సరుకులు ఇవ్వొద్దని హుకుం
- ఇచ్చిన వారికి రూ.50వేల జరిమానా అంటూ హెచ్చరిక
- విచారణ చేపట్టిన అధికారులు

7లో..



హుస్నాబాద్ మార్కెట్‌లో కాంటా అయిన పొద్దుతిరుగుడు బస్తాలు

జోరుగా పొద్దు తిరుగుడు కొనుగోళ్లు

- జిల్లాలో గతం కంటే పెరిగిన సాగు విస్తీర్ణం
- ఇప్పటి వరకు 8 వేల క్వింటాళ్ల కొనుగోలు
- ఏప్రిల్‌లో మరింత ఊపందుకునే అవకాశం

హుస్నాబాద్, మార్చి 22 : పొద్దు తిరుగుడు కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. ఇరవై రోజుల క్రితం ప్రభుత్వం జిల్లాలో ఏడు వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే, ఇంకా కొంత పంట పొలాల్లోనే ఉంది. మరికొంత మంది రైతులు గింజలను ఎండబెడుతున్నారు. ఏప్రిల్‌లో కొనుగోళ్లు మరింత ఊపందుకునే అవకాశాలున్నాయని మార్కెట్ అధికారులు పేర్కొంటున్నారు.



మద్దతు ధర రూ.6,760


జిల్లాలో సిద్దిపేటతో పాటు హుస్నాబాద్, కట్కూర్, బెజ్జంకి, చిన్నకోడూర్, గజ్వేల్, తొగుటలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. క్వింటాలుకు రూ.6,760 మద్దతు ధరను ప్రకటించారు. ఈ కేంద్రాల ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 8 వేల క్వింటాళ్ల పొద్దు తిరుగుడు గింజలను కొనుగోలు చేశారు. హుస్నాబాద్‌లో 81 మంది రైతుల వద్ద 750 క్వింటాళ్లను కొనుగోలు చేశారు. హుస్నాబాద్ ప్రాంతంలో కొత్తగా కట్కూర్‌లో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాలో ఈసారి పొద్దు తిరుగుడు సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. దాదాపు 9,279 ఎకరాల్లో పొద్దు తిరుగుడు పంటను సాగు చేశారు. గతేడాది దాదాపు 40 వేల క్వింటాళ్ల కొనుగోళ్లు జరగగా ఈసారి 74,232 క్వింటాళ్ల కొనుగోలు చేసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

పొద్దు తిరుగుడుకు కట్కూర్ ప్రత్యేకం

పొద్దు తిరుగుడు పంటకు అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామం ప్రత్యేకంగా నిలుస్తున్నది. ఈ గ్రామంలో దాదాపు 410 ఎకరాల్లో పొద్దుతిరుగుడు పంటను సాగు చేశారు. అందుకే ఈసారి ప్రత్యేకంగా ఇక్కడ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గురువారం నుంచి కొనుగోళ్లు మొదలవ్వగా తొలిరోజే 104 క్వింటాళ్లను కొనుగోలు చేశారు.



హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన పొద్దు తిరుగుడు



రిజర్వాయర్ నుంచి కొండపాక మండలానికి వచ్చే కాలువ

కెనాల్ పూడ్చివేత.. సాగునీటి గోస

- తపాస్‌పల్లి రిజర్వాయర్ డీ4 కెనాల్‌లో మట్టి పోసి పూడ్చివేత
- కొండపాక మండలానికి నిలిచిన సరఫరా
- ఎండిపోతున్న పంటలు.. అయోమయంలో రైతులు



కొండపాక మండలానికి నీరు రాకుండా డీ4 కెనాల్‌లో మట్టి పూడ్చివేత

కొండపాక, మార్చి 22 : తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలానికి సరఫరా చేసే కాలువను మట్టితో పూడ్చివేయడంతో సాగునీటికి గోస తప్పడం లేదు. మండువేసవిలో డీ4 కెనాల్ ద్వారా వచ్చే గోదావరి జలాలకు అడ్డుకట్ట వేయడంతో రైతులు దిక్కు తోచకున్నారు.



తపాస్‌పల్లి రిజర్వాయర్

ఏటా గోదావరి జలాలు

తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నిర్మించిన సమయంలో కొండపాక మండలంలోని గ్రామాల పరిసర ప్రాంతాల నుంచి అప్పటి వరంగల్ జిల్లా ప్రాంతానికి సాగునీటి కాలువలను నిర్మించారు. కానీ కొండపాక మండలానికి కాలువలను నిర్మించలేదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత అప్పటి సీఎం కేసీఆర్ చొరవతో కాలువ నిర్మాణానికి రూ.42 కోట్లు విడుదలయ్యాయి. డీ4 కెనాల్‌ను నిర్మించి మండలంలోని పలు గ్రామాల చెరువులకు ప్రతీ ఏటా గోదావరి జలాలను నింపుతున్నారు. నిండు వేసవిలో సైతం మత్తళ్లు పారేవి.



చేర్యాల ప్రాంతానికి నిరంతరాయంగా నీరు పోవడానికి కాలువ గేట్ల తొలగింపు

మళ్లీ మొదటికొచ్చిన కష్టాలు

సాగునీటికి ఢోకా లేదని అనుకుంటున్న మండల రైతులకు కష్టాలు మళ్లీ మొదటికి వచ్చాయి. కొండపాక మండలానికి సాగునీరు సరఫరా చేసే డీ4 కెనాల్‌లో తిమ్మారెడ్డిపల్లి శివారులో చేర్యాల తదితర ప్రాంతాలకు చెందినవారు మట్టిపోసి కెనాల్‌ను పూడ్చివేశారు. అక్కడి ప్రాంత నాయకుల అండదండలతో కాలువ పూడ్చివేశారని రైతులు వాపోతున్నారు. అలాగే డీ2, డీ3 కెనాల్‌లకు ఏర్పాటు చేసిన గేట్లను ధ్వంసం చేసి వారి ప్రాంతానికి ఎప్పటికీ నీరుచేరేలా చేసుకున్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మిన్నుకుండిపోయారు.

అసలు సమయంలో..

వరి పంట పాలు పోసుకునే దశకు చేరుకున్నది. ఈ సమయంలోనే నీరు ఎక్కువ అవసరం ఉంటుంది. కాలువల ద్వారా నీరు రాకపోవడం, వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో పంటలు ఎండుముఖం పట్టాయి. రైతులు సాగుకు పెట్టిన పెట్టుబడులు చేతికి అందే పరిస్థితులు లేవని ఆందోళనకు గురవుతున్నారు.

మా దృష్టికి వచ్చింది

డీ4 కెనాల్ నుంచి నీరు వెళ్లకుండా అడ్డంగా మట్టి వేసిన విషయం మా దృష్టికి వచ్చింది. తగు చర్యలు తీసుకుంటాం. చెరువులకు నీరు అందే విధంగా చూస్తాం. రైతులు ఆందోళన గురికావద్దు.
- అంజయ్య, డీఈఈ, తపాస్‌పల్లి రిజర్వాయర్

మాజీ సైనికుల సంక్షేమానికి ప్రభుత్వాల కృషి

● ప్రాంతీయ సైనిక సంక్షేమాధికారిణి సత్యశ్రీ

సంగారెడ్డి రూరల్, మార్చి 22: మాజీ సైనికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ప్రాంతీయ సైనిక సంక్షేమాధికారిణి సత్యశ్రీ అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని మాజీ సైనికుల సంక్షేమ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మాజీ సైనికులు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారి తెలంగాణ రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖను పూర్తి డిజిటలైజ్ చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలోని మాజీ సైనికుల డాటాను పూర్తిగా కంప్యూటరైజ్ చేసినట్లు తెలిపారు. మాజీ సైనికులకు లభించే రాయితీల కోసం ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవడం ద్వారా సమయం, శ్రమ ఆదా అవుతాయని తెలిపారు. ఈ సమావేశంలో దిగ్విజయ్, సరస్వతి, మద్రాస్ రెజిమెంటల్ సెంటర్ అధికారులు ఎస్ఎస్.రావు, జితేంద్రా రావు, రాజ్‌మియన్, ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ సైనికులు పాల్గొన్నారు.

చాపకింద నీరులా క్షయ

నివారణకు చర్యలు శూన్యం

- అవగాహన కల్పించడంతో వైద్యాధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం
- సంగారెడ్డి జిల్లాలో 2వేలకు పైగా బాధితులు
- రేపు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం

సంగారెడ్డి అర్బన్, మార్చి 22: వైద్యాధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో పూర్తి స్థాయిలో క్షయ నివారణ జరగడం లేదు. ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే ఈ వ్యాధి నివారణపై ఉన్నతాధికారుల పట్టింపులేక సంగారెడ్డి జిల్లాలో క్షయ నివారణ విభాగం అధికారులు, వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ కేంద్రాల్లో క్షయ వ్యాధి చాపకింద నీరులా వ్యాపిస్తున్నది.

దేశంలో క్షయ వ్యాధిని 2025నాటికి పూర్తిగా పారదోలాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వ అధునాతన, ఖరీదైన యంత్ర పరికరాలను సమకూర్చింది.

క్షయ నివారణకు చర్యలు తీసుకుంటున్నాం

సంగారెడ్డి జిల్లాలో క్షయ నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ఎన్‌జీవోలు, పరిశ్రమల సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించే ప్రయత్నం చేస్తున్నాం. జిల్లా క్షయ నివారణ కార్యాలయంతో పాటు ఎంఎన్ఆర్ మెడికల్ కాలేజీ టీబీ చికిత్స యూనిట్‌లోనూ మెడికల్ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటి భర్తీకి చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారికి గతంలోనే నివేదించాం. అయినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. క్షయ రోగులకు పౌష్టికాహార నిమిత్తం నెలకు చెల్లించాల్సిన డబ్బులు బడ్జెట్ విడుదల కాకపోవడంతో ఆరు నెలలుగా జమ చేయలేకపోయాం. నిధులు విడుదల కాగానే జమ చేస్తాం.

- రాజేశ్వరి, జిల్లా టీబీ ప్రోగ్రాం ఆఫీసర్

ఎప్పటికప్పుడు రోగులకు సరిపడా మందులను పంపుతున్నది. కానీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వద్ద ఎలాంటి కార్యాచరణ లేదు. ఏడాదికొకసారి జిల్లా టీబీ ఫోరం సమావేశం, ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ, సమావేశంతోనే సరిపెడుతున్నారు. అవగాహన కార్యక్రమాలు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు.

క్షయ లక్షణాలు

- రెండు వారాలకు మించి దగ్గు రావడం.
- దగ్గుతున్నప్పుడు రక్తం పడడం.
- సాయంత్రం, రాత్రి వేళలో జ్వరం రావడం.
- ఆకలి లేకపోవడం, బరువు క్రమంగా తగ్గడం.

ఈ లక్షణాలు ఉన్నప్పుడు నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే ప్రమాదం. దగ్గు రూపంలో ఒకరి నుంచి మరొకరికి సోకే ఈ వ్యాధి ప్రాణాలనే బలి తీసుకుంటుంది. జిల్లాలో ఏటా సుమారు 70మంది వరకు క్షయ వ్యాధితో చనిపోతున్నారంటే పరిస్థితి ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు.

జిల్లాలో క్షయ కేసుల పెరుగుదల ఇలా..

సంగారెడ్డి జిల్లాలో క్షయ కేసులు పెరగడం ఆందోళనకు గురిచేస్తున్నది. 2018లో 1,476 కేసులు, 2019లో 1,798 కేసులు, 2020లో 1,692 కేసులు, 2021లో 1,702 కేసులు, 2022లో 2,389 కేసులు, 2023లో 2,250 కేసులు, 2024(ఈ నెల 22వరకు)లో 374 క్షయ కేసులు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. ఏటా క్షయ బాధితుల సంఖ్య పెరగడం కలవరపెడుతున్నది. జిల్లాలో ఆరు చికిత్స యూనిట్లతో పాటు పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో క్షయ బాధితులను గుర్తిస్తున్నా కేసులు పెరగడం ఆందోళనకు గురిచేస్తున్నది.

ఆరు నెలలుగా నిలిచిన నగదు జమ

కేంద్ర సర్కారు నిక్షయ్ పోషన్ యోజన కింద పౌష్టికాహారం కోసం ప్రతీ నెల క్షయ రోగి ఖాతాలో రూ.500 జమ చేస్తుంది. ఇందుకు సంబంధించిన నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు విడుదలవుతాయి. వాటిని జిల్లా కలెక్టర్ అనుమతితో సంబంధిత రోగి ఖాతాలో నేరుగా జమ చేస్తారు. ఆరు నెలలుగా నిధులు జమ కావడం లేదు. నిధుల లేమి కారణంగా నగదు జమ నిలిచినట్టు అధికారులు తెలిపారు.



సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలోని జిల్లా క్షయ నివారణ కేంద్రం

అధికారుల నిర్లక్ష్యం.. రోగులకు శాపం

వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని ఉన్నతాధికారులు తరుచూ జిల్లా వైద్యాధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సూచిస్తున్నా నిర్లక్ష్యం వహిస్తుండడంతో రోగుల పాలిట శాపంగా మారింది. సంగారెడ్డిలోని జిల్లా టీబీ కార్యాలయంలో నిత్యం టీబీ రోగులకు వైద్య సేవలందించాల్సిన మెడికల్ ఆఫీసర్ పోస్టు రెండేళ్లుగా ఖాళీగా ఉంది. దీంతో జిల్లా టీబీ ప్రోగ్రాం ఆఫీసరే కార్యాలయంలో ఉంటూ క్షయ రోగులకు సేవలందిస్తున్నారు. జిల్లా అంతటా క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ క్షయ నివారణకు చర్యలు తీసుకోవాల్సిన ఆ ప్రోగ్రాం ఆఫీసర్ సైతం కార్యాలయంలోనే విధులు నిర్వహిస్తుండడంతో నివారణ ఎలా జరుగుతుందనే విమర్శలొస్తున్నాయి. వ్యాధి నివారణకు జిల్లా ప్రోగ్రాం అధికారితో పాటు క్షేత్ర స్థాయిలో పనిచేసే ఎస్‌టీఎస్, ఎస్‌టీఎల్ఎస్‌లకు ప్రభుత్వం వాహన సదుపాయం, రవాణా భత్యం కూడా చెల్లిస్తున్నప్పటికీ కొందరు జిల్లా కేంద్రానికే పరిమితమవుతున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సైతం క్షయ నివారణ విభాగంతో తరుచూ సమీక్షలు జరపడకపోవడం క్షయ వ్యాధి పెరుగుదలకు కారణం.

వివాహమైన 10 నెలలకే వివాహిత ఆత్మహత్య

- కుటుంబ కలహాలే కారణం?



భర్త మధుసూధన్‌రెడ్డితో కవితారెడ్డి(ఫైల్)

అల్వాల్, మార్చి 22: వివాహమైన 10 నెలలకే వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం సికింద్రాబాద్‌లోని అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అల్వాల్ ఎస్‌ఐ సురేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చిట్యాల గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డి కూతురు కవితారెడ్డి(28)ని 10 నెలల క్రితం సిద్దిపేట జిల్లా తొగుటకు చెందిన మధుసూధన్‌రెడ్డికి ఇచ్చి ఘనంగా వివాహం చేశారు. దంపతులిద్దరూ సికింద్రాబాద్‌లోని అల్వాల్ జొన్నబండలోని ఎంహెచ్ఆర్ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. మధుసూధన్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా, కవితా కిమ్స్ ఆస్పత్రిలో అడ్మిన్‌గా పనిచేస్తున్నారు. మధుసూధన్‌రెడ్డి తల్లి అనారోగ్యానికి గురవడంతో ఆమెకు తోడుగా ఉండేందుకు రెండురోజుల క్రితం తొగుటకు మధుసూధన్‌రెడ్డి వెళ్లాడు. అదే రోజు ఆస్పత్రిలో విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన కవితారెడ్డి భర్త లేకపోవడంతో కాలక్షేపం కోసం ఆమె ఇంటికి సమీపంలోనే ఉండే తన భర్త మధుసూధన్‌రెడ్డి సోదరి తాటిపర్తి కల్పనారెడ్డి ఇంటికి వెళ్లింది. అక్కడే భోజనం చేసి రాత్రి నిద్రించింది. శుక్రవారం ఉదయం 6-30గంటలకు నిద్ర లేచిన కవితారెడ్డి ఆఫీసుకు వెళ్లాలని కల్పనారెడ్డికి చెప్పి వారింటికి వెళ్లింది. ఉదయం 8-30 గంటలవుతున్నా కవితారెడ్డి తలుపులు తీయలేదు. అనుమానం వచ్చిన కల్పనారెడ్డి తన భర్తతో పాటు స్థానికుల సహాయంతో కిటికీ తెరిచి చూడగా కవితారెడ్డి ఫ్యాన్‌కు ఉరేసుకుని విగత జీవిగా కనిపించింది. అల్వాల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకి దించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ కలహాల కారణంగానే కవితారెడ్డి ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తున్నది.

టిఫిన్ సెంటర్‌లో గంజాయి స్వాధీనం

- ఒకరిని అరెస్టు చేసిన ఎక్సైజ్ అధికారులు

నారాయణఖేడ్, మార్చి 22: టిఫిన్ సెంటర్‌లో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి 600 గ్రాముల ఎండుగంజాయిని పట్టుకున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వీణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం ర్యాలమడుగు తండా శివారులోని నిజాంపేట- ఖేడ్- బీదర్ జాతీయ రహదారి పక్కన భవానీ టిఫిన్ సెంటర్ ఉంది. అందులో గంజాయిని విక్రయిస్తున్నారని నమ్మదగిన సమాచారం అందడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ అనిల్, సిబ్బందితో కలిసి గురువారం రాత్రి తనిఖీ చేశారు. ఈ తనిఖీలో 600 గ్రాముల ఎండు గంజాయి పట్టుకున్నారు. దీని విలువ రూ.16 వేల వరకు ఉంటుందని చెప్పారు. గంజాయి విక్రయిస్తున్న ఎండీ.మహ్మద్‌ను అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రధాన నిందితుడైన టిఫిన్ సెంటర్ యజమాని జతీలాల్ పరారీలో ఉన్నాడని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వీణారెడ్డి శుక్రవారం వివరించారు.

బంధువుగా వచ్చి ఇంట్లో చోరీ

- రూ.40వేల నగదు, అరతులం బంగారం అపహరణ

శివ్వంపేట, మార్చి 22: ఇంటికి చుట్టపు చూపుగా వచ్చి, ఇంట్లో ఉన్న నగలు, నగదు అపహరించిన ఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం ఎదుల్లాపూర్‌లో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎదుల్లాపూర్‌కు చెందిన ఉప్పరి భిక్షపతి ఇంటికి చుట్టపు చూపుగా హత్నూర మండలం బోర్పట్లకు చెందిన మల్లేశ్ ఈ నెల 20న వెళ్లాడు. ఈ క్రమంలో మల్లేశ్‌ను ఇంట్లోనే ఉంచి భిక్షపతి తన భార్యతో కలిసి పనిమీద బయటకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన మల్లేశ్ ఆ ఇంట్లో భిక్షపతి తన కూతురు పెళ్లికి దాచిన రూ.40వేల నగదు, అర తులం కమ్మలతో పాటు సెల్‌ఫోన్ తీసుకుని ఉడాయించాడు. ఇంటికి వచ్చిన భిక్షపతి దంపతులు చోరీ జరిగినట్లు గుర్తించి, శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విరాళాలు సేకరించి, రోడ్డు నిర్మాణం

- తాత్కాలికంగా సమస్యను పరిష్కరించుకున్న కేసీఆర్ కాలనీవాసులు



మట్టి రోడ్డును ఏర్పాటు చేసుకున్న దృశ్యం

రామాయంపేట, మార్చి 22: మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రానికి సమీపంలో పది నెలల క్రితం బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ కాలనీ పేరిట 295 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టి, పంపిణీ చేయగా సుమారు 800 మంది నివాసముంటున్నారు. కానీ కాలనీకి రోడ్డును నిర్మించలేదు. పది నెలలు కావస్తున్నా సరైన రోడ్డు మార్గమే లేకపోవడంతో బండరాళ్ల మీదుగా కాలనీవాసులు ప్రయాణాలు సాగిస్తున్నారు. సమస్యను మున్సిపాలిటీ అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం. ఈ నేపథ్యంలో శుక్రవారం కాలనీవాసులంతా తమలో తాము తోచినంత విరాళాల రూపంలో డబ్బులు సేకరించి మట్టి రోడ్డు నిర్మించుకున్నారు. దీంతో తాత్కాలికంగా కేసీఆర్ కాలనీవాసులకు రోడ్డు సమస్యల తీరింది.

ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయండి



సంగారెడ్డిలో యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

సంగారెడ్డి రూరల్, మార్చి 22: ప్రభుత్వ పాఠశాలలను పబ్లిక్ స్కూళ్లుగా ఎంపిక చేసి అభివృద్ధి చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి, జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని యూటీఎఫ్ కార్యాలయంలో యూనియన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి 23వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మండలానికి ఒక పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్ది పేద విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యనందించేందుకు సంకల్పించారని చెప్పారు. ఇప్పటికే మండల కేంద్రాల్లో ఉన్న జడ్పీ ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి, అభివృద్ధి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు శ్రీనివాస్‌రావు, జిల్లా కార్యదర్శులు లసాయితేజ, సింహాచలం, నాయకులు విజయానంద్, నరేందర్, మనోహర్, మురార్జి, సంజీవయ్య పాల్గొన్నారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న ఐసీడీఎస్ అధికారులు

కొల్చారం, మార్చి 22: మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని ఓ గ్రామంలో బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు శుక్రవారం అడ్డుకున్నారు. 15సంవత్సరాల వయసు గల బాలిక వివాహం జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఐసీడీఎస్ డీసీపీవో కరుణశీల, సూపర్‌వైజర్ సంతోష, సిబ్బంది కొల్చారం పోలీసుల సహాయంతో వెళ్లి వివాహాన్ని అడ్డుకున్నారు. బాలికను మెదక్‌లోని సఖి కేంద్రానికి తరలించారు. బాలిక తల్లితండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఖాజీపూర్‌లో ముదిరాజ్‌ల సాంఘిక బహిష్కరణ

- చేపలు పట్టుకునే విషయమై గ్రామస్థులకు, ముదిరాజ్‌లకు మధ్య వివాదం
- 25ముదిరాజ్ కుటుంబాలను వెలేసిన గ్రామాభివృద్ధి కమిటీ
- నిత్యావసర సరుకులు ఇవ్వవద్దని హుకూం
- ఇచ్చిన వారికి రూ.50వేల జరిమానా అంటూ హెచ్చరిక
- విచారణ చేపట్టిన అధికారులు



ఖాజీపూర్ గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు

మిరుదొడ్డి/అక్బర్‌పేట-భూంపల్లి, మార్చి 22: గ్రామంలోని చెరువులో చేపలు పట్టుకునే విషయంలో గ్రామస్థులకు, ముదిరాజ్‌లకు వివాదం తలెత్తడంతో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ముదిరాజ్‌లను గ్రామ బహిష్కరణ చేశారు. దీంతో బాధితులు కలెక్టర్‌ను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళ్లితే.. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్ గ్రామంలోని పెద్ద చెరువులో చేపలు పట్టుకునే విషయంలో గ్రామస్థులకు, ముదిరాజ్‌లకు మధ్య కొన్నేళ్లుగా వివాదం నడుస్తున్నది. చెరువుపై గ్రామాభివృద్ధి కమిటీకే హక్కు ఉన్నదని, ముదిరాజ్‌లకు హక్కు లేదంటూ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామంలోని 25ముదిరాజ్ కుటుంబాలను గురువారం సాంఘిక బహిష్కరణ చేశారు. గ్రామంలో నిత్యావసర సరుకులు అమ్మవద్దని, ఎవరైనా సరుకులు ఇచ్చినా.. సహకరించినా రూ.50వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. దీంతో బాధితులు శుక్రవారం సిద్దిపేట కలెక్టర్ మను చౌదరికి ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ ఈ ఘటనపై విచారణ జరపాలని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి సరోజ, మత్స్యశాఖ జిల్లా అధికారి మల్లేశంను ఆదేశించారు. వారు శుక్రవారం గ్రామాన్ని సందర్శించి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ముదిరాజ్‌లతో మాట్లాడారు. 1994లోనూ చేపలు పట్టే విషయమై సమస్య తలెత్తినప్పుడు గ్రామాభివృద్ధి కమిటీ వేసుకున్నామని, అప్పటి నుంచి పెద్ద చెరువుపై గ్రామాభివృద్ధి కమిటీకే హక్కు ఉన్నదని గ్రామస్థులు అధికారులకు చెప్పారు. ఇప్పుడు కొత్తగా తమకే హక్కు ఉన్నదంటూ ముదిరాజ్‌లు వివాదం సృష్టించారని చెప్పారు. అయితే సాంఘిక బహిష్కరణ నేరమని, వెంటనే బహిష్కరణను ఎత్తివేయాలని అధికారులు కమిటీ సభ్యులకు సూచించారు. పెద్ద చెరువు విషయమై కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని వెల్లడించారు. వారి వెంట డీఎల్‌పీవో మల్లికార్జున్‌రెడ్డి, తహసీల్దార్ జయంత్, ఎంపీడీవో గణేష్‌రెడ్డి, ప్రత్యేక అధికారి వీరేష్ ఉన్నారు.

ఆస్తి రాయించుకుని తల్లిదండ్రులను గెంటేసిన కొడుకు

- లీగల్ సర్వీసెస్ కమిటీని ఆశ్రయించిన వృద్ధులు
- ఇంటి తాళాలు ఇప్పించిన న్యాయాధికారి



నర్సాపూర్ కోర్టులో వృద్ధ దంపతులకు ఇంటి తాళాన్ని అందజేస్తున్న న్యాయాధికారిణి అనిత

నర్సాపూర్, మార్చి 22: వృద్ధాప్యంలో తల్లిదండ్రులను కంటికి రెప్పలా చూడాల్సిన కుమారుడు ఆస్తులు రాయించుకుని ఇంటినుంచి గెంటేశాడు. వృద్ధ దంపతులు నర్సాపూర్ లీగల్ సర్వీసెస్ కమిటీని ఆశ్రయించి, ఇంటి తాళాలను తిరిగి పొందారు. మెదక్ జిల్లా నర్సాపూర్ డివిజన్ కౌడిపల్లి మండలం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన గండి లచ్చయ్య, గండి తులసమ్మ దంపతులకు కుమారుడు మధుసుదన్‌గౌడ్ ఉన్నాడు. తల్లితండ్రుల పేరిట ఉన్న ఇంటిని వారికి తెలియకుండానే మధుసుదన్‌గౌడ్ తన పేర రాయించుకుని తల్లిదండ్రులను ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. రోడ్డుపాలైన వృద్ధ దంపతులు తాము ఉండేందుకు నీడ లేదన్న మనోవేదనతో శుక్రవారం నర్సాపూర్‌లోని లీగల్ సర్వీసెస్ కమిటీని ఆశ్రయించారు. వృద్ధ దంపతుల గోడును న్యాయాధికారిణి కె.అనిత దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించారు. ఇంటికి సంబంధించిన తాళాలను మధుసుదన్‌గౌడ్ నుంచి స్వాధీనం చేసుకుని వృద్ధ దంపతులకు తిరిగి అప్పగించారు. ఈ సందర్భంగా న్యాయాధికారిణి మాట్లాడుతూ.. కొడుకులు, కూతుళ్లు తల్లితండ్రుల ఆలనా పాలన చూడకుండా ఇబ్బందులకు గురిచేస్తే చట్ట ప్రకారం కఠిన శిక్ష తప్పదని హెచ్చరించారు. తల్లిదండ్రుల ఆస్తులు వారిని కాదని తీసుకుంటే స్వాధీనం చేసుకునే అవకాశం ఉందన్నారు. వృద్ధాప్యంలో కడుపునిండా భోజనం, కాస్త ప్రేమఆప్యాయతలు చూపితే ఎంతో సంబురపడతారని చెప్పారు. ఆమె వెంట న్యాయవాదులు ఎ.శ్రీనివాస్, మధుశ్రీ, స్వరూపారాణి, సూపరింటెండెంట్ పద్మావతి, లీగల్ సర్వీసెస్ సిబ్బంది ఉన్నారు.

పోచారంలో వన్య ప్రాణులకు రక్షణ కల్పించాలి

- చెక్‌పోస్టులలో తనిఖీలు నిర్వహించాలి
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



పోచారం గెస్ట్‌హౌజ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

హవేళీఘణపూర్, మార్చి 22: ప్రసిద్ధిగాంచిన మెదక్ జిల్లా హవేళీఘణపూర్ మండలం పోచారంలోని వన్యప్రాణులకు వేసవి దృష్ట్యా తాగు నీరు, ఆహారం సమకూర్చి వాటి సంరక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. శుక్రవారం పోచారం గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును, పోచారం వన్యప్రాణుల సంరక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెక్‌పోస్టుల వద్ద పక్కాగా తనిఖీలు చేయాలన్నారు. ఎన్నికల్లో నగదు, బంగారం, ఇతర కానుకలను పంపిణీ చేసే అవకాశం ఉన్నందున తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలను పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, వీడియో సర్వేలెన్స్, స్టాటికల్ అకౌంటింగ్, వ్యయపరిశీలక బృందాలు విస్తృతంగా సర్వేలు నిర్వహించాలని సూచించారు. సీజ్ చేసిన వస్తువులకు వివరాలతో కూడిన రశీదులు ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం పోచారం పార్కులోని వన విజ్ఞాన కేంద్రాన్ని, వన్య ప్రాణి సంరక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. అడవి జంతువుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అటవీ విస్తీర్ణం, సందర్శకుల రిజిస్టర్, వనవిజ్ఞాన కేంద్రం గురించి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా వాటికి కావ్సిన ఆహారం, ఇతర సదుపాయాలు, ఎలాంటి హాని జరగకుండా చూసుకోవాలని ఫారెస్టు అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు సమీపంలో ఉన్న గెస్ట్‌హౌజ్‌లను కూడా కలెక్టర్ పరిశీలించారు. ఆయన వెంట మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ నారాయణ, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ శ్రవణ్‌కుమార్, బీట్ ఆఫీసర్ ప్రసాద్, తదితరులు ఉన్నారు.

వేసవి కాలం.. కోళ్లు, జీవాలు పదిలం!

- ఎండాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం
- పెంపకందారులు జాగ్రత్తలు తీసుకోవాలి: పశువైద్యులు



చిన్నకోదూరు, మార్చి 22: రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీంతో కోళ్లు, జీవాలకు పలు రకాల వ్యాధులు సోకే అవకాశం ఉంది. ఎండాకాలంలో కోళ్లు, జీవాల సంరక్షణకు పెంపకందారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యులు సూచిస్తున్నారు.

పశువైద్యుల సూచనలు పాటించాలి



కోళ్లు, పశు పెంపకందారులు వేసవిలో వాటి రక్షణకు తప్పకుండా పశువైద్యుల సూచనలు పాటించాలి. ఎండలు మండుతున్నందున కోళ్లఫారాల్లు, పశువుల షెడ్లు చల్లగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలి. వేసవిలో వాటి రక్షణకు గల ఏమైనా సందేహాలంటే పశువైద్యులను సంప్రదించాలి.

- మంజుల, మండల పశువైద్యాధికారిణి, చిన్నకోడూరు

ఫారాల్లో కోళ్ల రక్షణకు ఇలా చేయాలి

అధిక ఉష్ణోగ్రతలతో కోళ్ల బరువు పెరగకుండా ఆగిపోవడం, గుడ్ల ఉత్పత్తి తగ్గడం తదితర ప్రతికూలతతో పాటు, కొన్ని సందర్భాల్లో కోళ్లు చనిపోయే అవకాశం ఉంటుంది.

- కోళ్లఫారాల షెడ్లపై తుంగ లేదా వరిగడ్డి పరచి స్ప్రింక్లర్ల ద్వారా నీటిని చల్లుతూ ఉండాలి. షెడ్లలో ఫాగర్లను ఏర్పాటు చేసుకోని, ఉష్ణోగ్రతలు పెరగకుండా చూసుకోవాలి.
- ప్లాస్టిక్, ఇనుప డబ్బాల్లో కోళ్లకు తాగునీటిని అందుబాటులో ఉంచితే అవి వేడెక్కుతాయి. డబ్బాలను తరచూ మార్చుతూ ఉండాలి. కోళ్లలో రాణిఖెట్ వ్యాధి వచ్చే అవకాశం ఉన్నందున నివారణకు టీకాలు వేయించాలి.

జీవాలను ఉదయం, సాయంత్రం వేళలో మేతకు తీసుకెళ్లాలి

గొర్రెలు, మేకలను ఉదయం, సాయంత్రం వేళలో మేతకు తీసుకెళ్లాలి. మధ్యాహ్నం వేళలో షెడ్లలో లేదా చెట్ల నీడన ఉంచాలి. జీవాలను తోలే షెడ్లలో వేడి పెరగకుండా ఉండేందుకు షెడ్లపై వరిగడ్డి, తుంగ, తాటి ఆకులు కప్పాలి. వేసవికాలంలో జీవాలకు గోమార్లు, పిడుదుల ద్వారా ప్రోటోజోవన్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంది. మశూచి నివారణకు టీకాలు వేయించాలి. మురుగు నీటిని తాగినప్పుడు పారుడు వంటి జీర్ణకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున నట్టల నివారణ మందులు వేయించాలి. జీవాలకు చల్లని తాగు నీటిని, సరైన మేతను అందుబాటులో ఉంచాలి.

పార్టీ ఖాతాలను పునరుద్ధరించాలి



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

చేర్యాల, మార్చి 22: కేంద్రప్రభుత్వం ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని, రాజ్యాంగ సంస్థలను చెప్పు చేతల్లో పెట్టుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తున్నదని యూత్ కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ అధ్యక్షుడు కమలాకర్‌యాదవ్ అన్నారు. స్తంభింపజేసిన కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం చేర్యాల పట్టణంలోని గాంధీచౌక్ వద్ద కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అవినీతిని ఎండగడుతుందన్న అక్కసుతోనే కాంగ్రెస్ పార్టీ రాజకీయ కార్యకలాపాలు చేయకుండా ఇబ్బంది పెట్టేందుకు ఖాతాలను స్తంభింపజేయడం తగదన్నారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బీజేపీకి 76శాతం డొనేషన్లు వచ్చాయని, బీజేపీ అవినీతికి ఇదే నిదర్శనమన్నారు. వెంటనే కాంగ్రెస్ ఖాతాల ఫ్రీజ్ ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు మంచాల చిరంజీవులు, కౌన్సిలర్లు చెవిటి లింగం, నాయకులు పుర్మ ఆగంరెడ్డి, తడక లింగమూర్తి, సుంకోజు శ్రీశైలం, బందెల మహిపాల్‌రెడ్డి, దాసరి శ్రీకాంత్, కాశెట్టి ఉపేందర్, నీలం సన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఒకే భవనంలో రెండు పాఠశాలలు

- ఒకే గదిలో రెండు తరగతులు
- తరగతి గదులే పడక గదులు

సిద్దిపేటరూరల్, మార్చి 22: ఒకే భవనంలో రెండు పాఠశాలలు, ఒకే గదిలో రెండు తరగతులు అందులోనే డార్మెంటరీ, క్లాస్ రూమ్, ఆరు గదులలో అర్బన్ రెసిడెన్షియల్ స్కూలు కొనసాగుతున్న దుస్థితి జిల్లా కేంద్రంలో నెలకొన్నది. విద్యార్థుల అవస్థలు అధికారులకు పట్టడం లేదు. వర్షం కురిస్తే విద్యార్థులు కునుకుతీయడం గగనమే. అసలే అనాథలు, తలదాచుకునే దారిలేక ఇరుకైన ఇక్కడే ఆశ్రమం పొందుతున్నారు.

ఒక్క గదిలో రెండు కార్యాలయాలు

జిల్లా కేంద్రంలోని నాసరపుర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనంలో ఆ పాఠశాలతో పాటు అర్బన్ రెసిడెన్షియల్ (బ్రిడ్జి కోర్సు) పాఠశాల కూడా కొనసాగుతున్నది. ఇక్కడ వంటగదితో కలిపి మొత్తం ఏడు గదులున్నాయి. ఒకే గదిలో రెండు పాఠశాలకు చెందిన కార్యాలయాలు, ఒకే వంట గదిలో రెండు పాఠశాలలకు సంబంధించిన వంటలు చేసి భోజనాలు వడ్డించాలి. ఒక గదిలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తరగతులు నిర్వహించటం, మిగతా నాలుగు గదులను తరగతి, డార్మెంటరీ గదులుగా గురుకుల పాఠశాల విద్యార్థులు వినియోగిస్తున్నారు. ఒకే గదిలో రెండు తరగతులు నిర్వహించడం వల్ల ఏ సబ్జెక్టు చెప్పాలో అర్థం కాని పరిస్థితి ఉపాధ్యాయులలో నెలకొన్నది.




ఒకే గదిలో రెండు తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, ఇదే గది డార్మింటరి కావడంతో విద్యార్థుల వెనుకాల పెట్టెలు

నిరుపయోగంగా ప్రభుత్వ భవనం

పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ భవనం నిరుపయోగంగా ఉంది. ఇదివరకు ఈ భవనంలో బీసీ సంక్షేమ వసతి గృహం కొనసాగేది. ఇదే ఆవరణలో నూతన భవనం నిర్మించి విద్యార్థులను అందులోకి తరలించారు. కొద్దిరోజులు ఈ భవనాన్ని ప్రభుత్వ ఐటీఐకి వినియోగించింది. సంవత్సర కాలంగా భవనం నిరూపయోగంగానే ఉంటున్నది. 13 గదులు, బోరు సౌకర్యం కూడా ఉంది. మరుగుదొడ్లకు మరమ్మతులు చేసి ఈ భవనాన్ని అర్బన్ గురుకుల పాఠశాలకు వినియోగించవచ్చు. కానీ అధికారులు తమకేమి పట్టింపులేనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఈ భవనం ఖాళీగా ఉండటంతో ఇందులో ఇతర రాష్ట్రానికి చెందిన భవన నిర్మాణ కూలీలు ఉంటున్నారు. అధికారులు ఈ భవనాన్ని సందర్శించి వినియోగంలోకి తేగలిగితే అర్బన్ గురుకుల పాఠశాలకు అనుకూలంగా ఉంటుంది.

మార్చేందుకు ప్రయత్నిస్తున్నాం



ప్రస్తుతం నాసర్‌పూరలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనంలో అర్బన్ గురుకుల పాఠశాల కొనసాగుతున్నది. అక్కడ సరిపడ గదులు లేకపోవడం చాలా ఇబ్బందికరంగానే ఉంది. ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే ఇక్కడి నుంచి పాఠశాలను తరలించేందుకు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నాం. విషయాన్ని జిల్లా విద్యాధికారి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి విద్యార్థుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తాను. వేసవి సెలవులలోనే అక్కడి నుంచి మార్చేందుకు ప్రయత్నం చేస్తాం.

– బేతి భాస్కర్, జిల్లా సెక్టోరియల్ అధికారి

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ములుగు, మార్చి 22: గుళికల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన ములుగు మండలం లక్ష్మక్కపల్లి శుక్రవారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన తోడేటి అశోక్(32) మంగళవారం వ్యవసాయ పొలం వద్ద గుళికల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం లక్ష్మక్కపల్లిలోన్ని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యం అందిస్తుండగా శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. అశోక్‌కి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆస్పత్రి వద్ద మృతుడి బంధువులు ఆందోళన చేయడంతో పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఆస్పత్రిపై కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. సరైన వైద్యం అందకనే తన భర్త చనిపోయాడని మృతుడి భార్య ఆరోపించారు. ఆస్పత్రి సీఈవో శ్రీనివాస్‌రావును సంప్రదించగా అశోక్ గుళికల మందు అధిక మోతాదులో తాగి రావడంతో ఆస్పత్రి వైద్యులు సరైన వైద్యం అందించారన్నారు. తమ ఆస్పత్రిలో పూర్తి వీడియో రికార్డు ఉందని తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి జారిపడి

గీతాకార్మికుడికి గాయాలు



గాయపడిని కనకయ్యగౌడ్

నారాయణరావుపేట, మార్చి 22 : తాటిచెట్టుపై నుంచి జారీ పడిన గీతాకార్మికుడికి గాయాలైన సంఘటన శుక్రవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన గడ్డం కనకయ్యగౌడ్ వృత్తిరీత్యా గీతాకార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజుమాదిరిగా తాటివనంలో తాటిచెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో కాలు జారి చెట్టుపై కాళ్లకు, చేతులకు, పొట్టకు గాయాలు అయ్యాయి. అక్కడే ఉన్న తోటి గీతాకార్మికులు వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కనకయ్యగౌడ్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని గీతా కార్మిక సంఘం ప్రతినిధులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బెజ్జంకి, మార్చి 22 : ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని తోటపల్లి రాజీవ్ రహదారిపై శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తోటపల్లి స్టేజి సమీపంలో రాజీవ్ రహదారి పక్కకు ఆగి ఉన్న లారీని హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కారు వెనుక వైపు నుంచి ఢీ కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న మహిళకు, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి స్థానికులు తరలించారు. గాయపడ్డ వారు జగిత్యాల జిల్లా పెగడపల్లి గ్రామానికి చెందిన వారని సమాచారం. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీ

- ముగ్గురికి గాయాలు

హుస్నాబాద్‌రూరల్, మార్చి 22 : ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొని ముగ్గురు గాయపడిన సంఘటన శుక్రవారం హుస్నాబాద్ మండలంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుస్నాబాద్ నుంచి పందిల్లకు వెళ్లే దారిలో ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్నాయి. పందిల్ల గ్రామానికి చెందిన రాజు కాలువిరిగింది. సదానందం పాదానికి తీవ్రంగా గాయమైంది. ఇద్దరిని సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరో వ్యక్తికి స్వల్ప గాయాలు కాగా స్థానికంగా చికిత్స అందించారు.

బెల్ట్‌షాపుపై పోలీసుల దాడి

సిద్దిపేట క్రైం, మార్చి 22 : సిద్దిపేట పట్టణంలోని పటేల్‌పురాలో గాదగోని నారాయణ ఇంట్లో అనుమతి లేకుండా బెల్ట్‌షాప్ నడుపుతున్నాడని నమ్మదగిన సమాచారం మేరకు శుక్రవారం సిద్దిపేట టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ తన సిబ్బందితో కలిసి వెళ్లి దాడి చేశారు. 16.04 లీటర్ల మద్యం బాటిల్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

దోమల నివారణకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చేర్యాల, మార్చి 22 : పట్టణంలోని డ్రైనేజీల్లో దోమలు స్వైరవిహారం చేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. ఈ విషయమై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో మునిసిపల్ కమిషనర్ నర్సయ్య స్పందించారు. ఈ సందర్భంగా పట్టణంలో పర్యటించి మురుగునీటి నిల్వ ప్రదేశాలను పరిశీలించి దోమల నివారణకు పిచికారీ చేయించారు. అనంతరం పట్టణంలోని రైస్‌మిల్లులు, పెట్రోల్ బంకులు, ప్రైవేటు పాఠశాలలను సందర్శించి ఇంటిపన్నులు, ట్రేడ్ లైసెన్స్‌ల జారీతో పాటు పన్ను వడ్డీరాయితీని వివరించారు.

అధిక సాంద్రత పత్తి సాగుపై అవగాహన

చేర్యాల, మార్చి 22 : మెదక్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం చేర్యాల మండలంలోని ముస్త్యాల గ్రామ రైతువేదికలో అధిక సాంద్రత పత్తి విత్తన సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రవికుమార్, కీటకశాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఉదయ్‌కుమార్ రైతులకు పలు సూచనలు చేశారు. ఒక ఎకరా సాగుకు ఆరు ప్యాకెట్లు సరిపోతాయని, మొక్కలకు మధ్యన 15 సెంటీమీటర్ల దూరంలో విత్తనాలను వేస్తే ఎకరాకు 29,600 మొక్కలు వస్తాయని తద్వారా 12-14 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని తెలిపారు. సదస్సులో వ్యవసాయాధికారులు అఫ్రోజ్, నరేశ్, రామకృష్ణ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేసి బీజేపీని గెలిపిద్దాం

- గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్

గజ్వేల్, మార్చి 22: బీజేపీ సిద్ధాంతాలకు అనుగుణంగా అంతా సమన్వయంతో పనిచేద్దామని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పట్టణ కమిటీలను ప్రకటించారు. యువమోర్చా అధ్యక్షుడిగా మెతుకు కరుణాకర్, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా సిలివేరు కుంకుమరాణి, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా సంఘం కరుణాకర్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా గడ్డమీది ప్రశాంత్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా బదనాపురం రమేశ్, బీసీ మోర్చా అధ్యక్షుడిగా దువ్వల రాజుయాదవ్, సోషల్ మీడియా కన్వీనర్‌గా గుంజేటి సాయితేజ, కోకన్వీనర్‌గా చింతల రోహిత్‌ను నియమించారు. పట్టణ కమిటీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, అధికార ప్రతినిధులను ప్రకటించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలు

సిద్దిపేట అర్బన్/ధూళిమిట్ట/కుకునూరుపల్లి, మార్చి 22 : సిద్దిపేట అర్బన్ మండలం ఎల్లుపల్లి, ధూళిమిట్ట మండలం కొండాపూర్ గ్రామ పరిధి మల్లన్నగుట్ట తండా, కుకునూరుపల్లి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఎల్లుపల్లిలో చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు శ్రీమంతాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీడీపీవో రమాదేవి, సూపర్‌వైజర్ మహాలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, మల్లన్నగుట్ట తండాలో సెక్టార్ సూపర్‌వైజర్ పుష్పలత, కుకునూరుపల్లిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి పాల్గొన్నారు.

పాలమాకుల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఎన్నిక

నంగునూరు, మార్చి 22 : నంగునూరు మండలం పాలమాకుల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అమ్మ ఆదర్శ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు. అధ్యక్షులుగా నెల్లుట్ల మమత, కన్వీనర్‌గా పొన్నమల్ల రాములు(హెచ్‌ఎం), సభ్యులుగా పలువురిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఏ భాగ్య, పాఠశాల ఉపాధ్యాయులు భూపాల్‌రెడ్డి, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

లంపి స్కిన్ వ్యాధి ప్రబలకుండా

పశువుల అంగళ్లను నిలిపివేయండి

హుస్నాబాద్ టౌన్, మార్చి 22 : లంపి స్కిన్ వ్యాధి ప్రబలకుండా నెల రోజుల పాటు పశువుల అంగళ్లను నిలిపివేయాలని రైతు రక్షణ సమితి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ కలెక్టర్‌ను కోరారు. శుక్రవారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల్లో నెల రోజుల నుంచి లేగ దూడలకు ఈ వ్యాధి సోకి 30 వరకు మృతిచెందినట్లు సమాచారం ఉందని తెలిపారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటేనే నివారించవచ్చని పేర్కొన్నారు.

మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలి

- కనువిప్పు కార్యక్రమంలో తొగుట సీఐ లతీఫ్ సూచన

కుకునూరుపల్లి, మార్చి 22 : ప్రజలు మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని తొగుట సీఐ లతీఫ్ తెలిపారు. గురువారం రాత్రి మంగోలు గ్రామంలో పోలీసులు కళా బృందంతో కనువిప్పు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

- జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్

వర్గల్, మార్చి 22: ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, ఆరోగ్య కార్యక్రమాల అమలుపై నిర్దేశించిన లక్ష్యాలను అందుకోవాలని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ ఆదేశించారు. వర్గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను, ఫార్మసీ స్టోర్, ఎల్‌టీ పనితీరును పరిశీలించారు. అలాగే ఆస్పత్రి ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనుల గురించి కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వంద శాతం పూర్తి చేసే విధంగా వైద్య సిబ్బంది కృషి చేయాలని, మాతా శిశు సంరక్షణ చర్యలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. సమయపాలన పాటించని వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వైద్య సిబ్బంది జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, మండల వైద్యాధికారి హరిత, వైద్య సిబ్బంది ఉన్నారు.



జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న వర్గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది

ప్రతాప్‌రెడ్డి మా పార్టీలోకి రావొద్దు

- మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్, మార్చి 22: ప్రతాప్‌రెడ్డి మా కాంగ్రెస్ పార్టీలోకి రావొద్దని కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి కోరారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం రిమ్మనగూడలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతాప్‌రెడ్డి ఏ పార్టీ నుంచి పోటీ చేస్తే ఆ పార్టీ ఓడిపోతుందని, ఆయన కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఎట్టి పరిస్థితిలో రానివ్వబోమని స్పష్టం చేశారు. నిన్న, మొన్నటి వరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఇష్టం వచ్చినట్లు ప్రతాప్‌రెడ్డి మాట్లాడారని దుయ్యబట్టారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా మేడ్చల్ మండలం గౌడవెల్లిలో రూ.100 కోట్ల విలువ చేసే భూమిని కాజేశారని ఆరోపించారు. లక్ష్మక్కపల్లిలో అక్రమంగా వెంచర్ వేస్తుండగా తామే నిలిపివేయించామని, ప్రజ్ఞాపూర్‌లో కూడా భూములను కాజేశారని ఆరోపించారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా ఓడిపోయిన ఆయనకు కోట్లాది రూపాయలు విలువ చేసే ఆస్తులు ఏలా వచ్చాయని ప్రశ్నించారు.



విలేకరులతో మాట్లాడుతున్న తూంకుంట నర్సారెడ్డి

అటవీ కళాశాల డీన్‌గా ఎస్‌జే ఆశ బాధ్యతల స్వీకరణ

ములుగు, మార్చి 22: మండల కేంద్రంలోని అటవీ కళాశాల డీన్‌గా ఎస్‌జే ఆశ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె హైదరాబాద్‌లో ఐఎఫ్‌ఎస్సీ డైరెక్టర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధ్యాపకులు విద్యార్థులకు మెరుగైన బోధన అందించడం కోసం అందరూ కృషి చేయాలని కోరారు. విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు.

సిద్దిపేట జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీ ఎన్నిక

సిద్దిపేట అర్బన్, మార్చి 22: సిద్దిపేట జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అయిత శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రాజబాబు, కార్యదర్శిగా మహిపాల్‌రెడ్డి, కోశాధికారిగా నరేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నాగరాజు, ఉపాధ్యక్షులుగా మల్లారెడ్డి, ఎల్లోహర్, జాయింట్ సెక్రటరీలుగా పర్శ రాములు, రాజు, గౌరవ సలహాదారులుగా వెంకన్న, మహేష్, యాదగిరి, కమిటీ సభ్యులుగా గణేష్, చందు, వెంకట్, అశోక్, సంతోష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

మల్లన్న లిఫ్ట్ దుర్వినియోగం



లిఫ్ట్‌లో యువకులను పంపిస్తున్న ఆలయ సంబంధీకులు

చేర్యాల, మార్చి 22: కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయవర్గాల తీరుతో దివ్యాంగులు, వృద్ధులకు ఆశించిన ప్రయోజనం కలగకపోవడంతో ఉసూరుమంటున్నారు. ఆలయానికి వచ్చిన దివ్యాంగులు, వృద్ధులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించేందుకు దాత సహకారంతో లిఫ్ట్ ఏర్పాటు చేసినా అది దుర్వినియోగమవుతున్నది. వెనకదారిగుండా దర్శనాలను నిలిపివేశామని గొప్పలు చెబుతున్నప్పటికీ, ఆలయవర్గాలలోని పలువురు తమ వ్యక్తిగత పలుకుబడితో లిఫ్ట్‌ద్వారా తమకు ఇష్టం వచ్చిన వారిని దర్శనానికి తీసుకువెళుతూ ఆదాయానికి గండి కొడుతున్నారు. లిఫ్ట్‌ను కేవలం దివ్యాంగులు, వృద్ధులకే వినియోగింపచేయాలని భక్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఆలయ వర్గాలు ఎలాంటి చర్యలు తీసుకుంటాయో వేచి చూడాల్సిందే.

రైస్ మిల్లులు ఎంతో అవసరం

దౌల్తాబాద్, మార్చి 22: రైతులు పండించిన ధాన్యం అమ్ముకోవడానికి రైస్ మిల్లులు ఎంతో అవసరమని, అందుబాటులో ఉన్న ఇండస్ట్రీస్ రైస్ మిల్లును రైతులు వినియోగించుకోవాలని దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మండల పరిధిలోని ముత్యంపేటలో నూతనంగా నిర్మించిన ఇండస్ట్రీస్ రైస్ మిల్లును శుక్రవారం ఆయన ప్రారంభించారు.

ఆరు గ్యారంటీలు వంద రోజుల్లోనే అమలు

- పూజల హరికృష్ణ

నారాయణరావుపేట, మార్చి 22: ఆరు గ్యారంటీలను సీఎం రేవంత్‌రెడ్డి వంద రోజుల్లోనే అమలు చేసి చూపించారని కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. శుక్రవారం నారాయణరావుపేట మండలం గోపులాపూర్ గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. అనంతరం పలువురు గ్రామస్తులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బర్మ రాంచంద్రం, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యాదర్శి చింతల రాజ్‌వీర్, ఫిష్మెన్ రాష్ట్ర కార్యదర్శి గౌటి బాబేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పూజల హరికృష్ణ

గ్యారంటీల అమలు కనిపించడం లేదా

వర్గల్, మార్చి 22 : ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీ పథకాలు బీఆర్ఎస్ నాయకులకు కనిపించడంలేదా అని వర్గల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అట్ల సందీప్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం వర్గల్ కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు ఇంకా బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ఉన్నమన్న భ్రమలో ఉన్నారన్నారు. ఇన్ని పథకాలు అమలు చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు అవేవీ తమకు కనిపించనట్లు ప్రవర్తిస్తున్నారన్నారు.

నీటిని ఆదా చేద్దాం



సలాఖ్‌పూర్ పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

మద్దూరు, మార్చి 22 : భావితరాల కోసం నీటిని ఆదా చేద్దామని, అందుకోసం నీటి సమస్య పరిష్కారానికి సంఘీభావంగా ర్యాలీల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు బాలవికాస ప్రతినిధి ఎస్. విమల్ తెలిపారు. శుక్రవారం మద్దూరు మండలం సలాఖ్‌పూర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేష్మాషౌకత్, కె. ప్రతాప్ అధ్యక్షతన ప్రపంచ నీటి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నీటిని ఆదా చేయడమే భావితరాలకు మనమిచ్చే కానుకగా గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఇర్రి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బందారం శ్రీనివాస్, ప్లాంట్ అధ్యక్షుడు ఇర్రి రాఘవేంద్రారెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ సిబ్బంది, పాల్గొన్నారు

ప్రతినీటి బొట్టును ఒడిసిపట్టాలి

మిరుదొడ్డి, మార్చి 22: ప్రతినీటి బొట్టును ఒడిసిపట్టి భావితరాలకు ఉపయోగపడే విధంగా చూడాలని బాలవికాస సేవా సంస్థ కోఆర్డినేటర్ కనకరాజు, ఆరెపల్లి ప్రాఠశాల ప్రధానోపాధ్యాయులు భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం మిరుదొడ్డి మండలం ధర్మారం, ఆరెపల్లి గ్రామాల్లో ప్రపంచనీటి దినోత్సవంపై వేరువేరుగా అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. భవిష్యత్తు తరాలను నీటి సంపదను అందించే విధంగా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగన్మోహన్‌రెడ్డి, బాలవికాస ప్రతినిధులు మల్లేశం, రాజు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకాచార్య జయంతి

చేర్యాల, మార్చి 22: కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయంలో జగద్గురు రేణుకాచార్య జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ఆవరణలోని రేణుకాచార్య మందిరంలో వీరశైవార్చకులు విశేష పూజలు, అభిషేకం జరిపారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. జగద్గురు రేణాకాచార్య సమాజానికి శివజ్ఞానాన్ని అందించడంతో పాటు హిందూధర్మ పరిరక్షణకు పాటుపడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, అర్చక సంఘం అధ్యక్షుడు పడిగన్నగారి ఆంజనేయులు, అర్చకులు మహదేవుని సాంబయ్య, మహదేవుని భాస్కర్, మహదేవుని మనోహర్, మహదేవుని రవి, రేవణ సిద్దేశ్వర్, శివకుమార్, సూర్య, శివప్రసాద్, వీరశైవాగమ పాఠశాల అధ్యాపకులు వీరేశలింగం పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

బెజ్జంకి, మార్చి 22: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం గోవిందమాంబ వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి మంగళహారతులు

చిన్నకోడూరు, మార్చి 22: చిన్నకోడూరు మండల కేంద్రంలోని గంగా భవాని ఆలయ 23వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగమ్మతల్లికి మంగళహారతులతో పాటు, బోనాలు తీశారు. ఈ సందర్భంగా మంగళహారతులు, బోనాలను గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పుచప్పుళ్లతో, జలపందిరితో, శివసత్తుల పూనకాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయం వద్ద అన్నదాన వితరణ చేశారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మెపా రాష్ట్ర కార్యదర్శి నియామకం

సిద్దిపేట అగ్రికల్చర్, మార్చి 22: ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్న పట్టణానికి చెందిన దాసరి శాంతకుమారిని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్రం (ఎంఈపీఏ) మెపా రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. నియామకపత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, ప్రధాన కార్యదర్శి బోట్ల పల్లి సంజీవన్ కుమార్, గౌరవ అధ్యక్షుడు జగన్‌మోహన్ ఆమెకు అందజేశారు.

చౌదరిపల్లి చెరువు సొసైటీ చైర్మన్ ఎన్నిక

వర్గల్, మార్చి 22: మండలంలోని చౌదరిపల్లి బంధం చెరువు సోసైటీ చైర్మన్‌గా పడిగే రాజు ఎన్నికైయ్యారు. శుక్రవారం చౌదరిపల్లి గ్రామపంచాయతీ వద్ద ప్రత్యేకాధికారి రేఖ ఆధ్వర్యంలో ఫిషరిస్ ఎన్నికలు నిర్వహించారు. సోసైటీ చైర్మన్‌గా పడిగే రాజు, వైస్ చైర్మన్‌గా నర్సింలు, సెక్రటరిగా కనకయ్య డైరక్టర్లుగా రవి, ఆగయ్య, పోచయ్య, వెంకటయ్య, చంద్రం, మహేశ్‌లు నియామకమైయ్యారు.

'దళిత మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలి'

గజ్వేల్, మార్చి 22: అమ్మ ఆదర్శ కమిటీల్లో దళిత మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి డిమాండ్ చేశారు. మండలంలోని దాచారం గ్రామంలో పాఠశాల విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ.. దళిత మహిళలకు ప్రాధాన్యతనిచ్చి దళిత పిల్లలు ఎక్కువగా చదివే ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ ఆ వర్గ మహిళలకే ఇవ్వడం సముచితంగా ఉంటుందన్నారు.

కానిస్టేబుల్‌కు రాష్ట్ర ఉత్తమ సేవా పతకం

కుకునూరుపల్లి, మార్చి 22: కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సారంపల్లి రమేష్ విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ప్రభుత్వ సేవా పతకానికి ఎంపికయ్యాడు. సిద్దిపేట సీపీ అనురాధ చేతుల మీదుగా రమేష్ పతకాన్ని అందుకున్నాడు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రతి ఒక్కరికీ రివార్డులు, అవార్డులు అందజేస్తామన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఆరోపణలో నిజం లేదు

సిద్దిపేట అర్బన్, మార్చి 22: అర్బన్ మండలం పొన్నాల సమీపంలో సర్వే నెంబర్ 19లో ఉన్న స్థలం కబ్జాకు గురైందని కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలు నిరాధారమైనవని పట్టాలు తీసుకున్న లబ్ధిదారులతోపాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న స్థానిక నాయకులు తెలిపారు. శుక్రవారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. స్థానిక నాయకులు అధికారి అండదండలతో కబ్జా చేసి అమ్ముకున్నారని కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని అన్నారు. లబ్ధిదారులకు 2022 సంవత్సరంలో అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే హరీశ్‌రావు చేతుల మీదుగా అప్పటి తహసీల్దార్ విజయసాగర్ ఆధ్వర్యంలోనే పట్టాలను పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. తాము ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, ఎవరి వద్ద కొనుగోలు చేయలేదని, ప్రభుత్వం నుంచి లబ్ధి పొందామని లబ్ధిదారులు తెలిపారు. స్థానిక నాయకులు కేకే రావు, తన్నీరు శ్రీనివాస్ మాట్లాడుతూ.. నిరాధారమైనటువంటి ఆరోపణలు చేస్తూ మనోవేదనకు గురి చేస్తున్నారని, నిరాధారమైన ఆరోపణలు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తామని తెలిపారు. పట్టాలు పంపిణీ చేసింది 19 సర్వే నెంబర్ అయితే 21 సర్వే నెంబర్‌లో కబ్జా చేశారని ఆరోపించడం సరైంది కాదని అన్నారు.



తమకిచ్చిన పట్టాలు చూపుతున్న లబ్ధిదారులు